క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్ధవటంరోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షా బంధనము, యాగశాల ప్రవేశం, అంకురార్పణం, గరుడపట ఆదివాసం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ అంకయ్య, ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ

కాశినాయన : మండలంలోని మూలపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటమ్మ సేవా సంస్థ నిర్వాహకుడు జీవీ రమణ బుధవారం పాఠశాలలో చదువుతున్న 28 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి నడవడిక కలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం అదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి రాజుపాళెం బాదుల్లా విద్యార్థులకు పలకలు, బలపాలు, పెన్సిళ్లు వితరణగా అందించారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సుహాసిని, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

లోక కల్యాణార్థం పాదయాత్ర

గోపవరం : మండలంలోని వల్లెలవారిపల్లె శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెనుశిల నరసింహస్వామి (పెంచలకోన) వరకు లోక కల్యాణార్థం నిర్వహించిన పాదయాత్ర దిగ్విజయంగా జరిగిందని ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్య స్వామి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు దాదాపు 80 కి.మీ. మేర సాగిన పాదయాత్రలో దారి పొడవునా నరసింహస్వామి భక్తులు పలకరిస్తూ పాదయాత్రకు పూర్తి సంఘీభావాన్ని తెలిపారన్నారు. మొట్టమొదటి సారిగా బద్వేలు నుంచి నిర్వహించిన ఈ పాదయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షనీయమన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎస్ఎస్సీ, సీజీఎల్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో బుధవారం పోటీ పరీక్షల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసెస్ ఫ్యాకల్టీ రవిశంకర్ మాట్లాడుతూ ఎస్ఎస్సీ సీజీఎల్ 14,582 పోస్టులు పడ్డాయని, వాటితోపాటు ఏపీ హైకోర్టు 1,621 పోస్టులు, బ్యాంక్ ఆఫ్ బరోడా 500 పోస్టులు, ఆర్ఆర్బీ గ్రూప్ డీ 32,438 పోస్టులు, ఏఎల్పీ 11,558 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఈ ఉద్యోగాలకు కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీతో రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోచింగ్ ఉంటుందన్నారు. కోచింగ్‌కు రాదలచిన వారు 9705333305 ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు రవిబాబు, నరేష్, దేవానంద్, మౌనిక, గాయత్రి, హైమావతి, భువన్, హరికేశన్, నరసింహులు పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కరించండి



నరసింహస్వామి ఆలయం వద్ద నిలిచిన మురుగు నీరు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లె బైపాస్ రోడ్డు నుంచి ఆదర్శ కాలనీకి వెళ్లే దారిలోని నరసింహస్వామి ఆలయం వద్ద మురుగు నిలడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో పూడిక పేరుకుపోయి నీరు రోడ్లపైకి వస్తోంది. ఆ నీటిలోనే ప్రజలు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. విషకీటకాలు, పాములు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని ఆలయ చైర్మన్ నరసింహస్వామి తెలిపారు. దోమలు వృద్ధి చెందడంతో రాత్రిళ్లు ప్రజలు నిద్రపోలేకున్నారని, దోమలు కుట్టడంతో వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

రొట్టె ముక్క కరువే.. కొర్రన్నం బరువే..!

జొన్నరొట్టె.. గుత్తి వంకాయ కూర చూస్తే చాలు ఎలాంటి వారికైనా సరే రొట్టె ముక్క నోట్లో పెట్టుకోక ముందే నీళ్లూరుతాయి. నీళ్లూరుడ మేమిటి..'అహా! ఏమి రుచి తినరా మైమరిచి'అని పాట పాడుతూ లొట్ట లేసుకుని మరీ తింటారు. జొన్నరొట్టే చేపల పులుసు అదిరే కాంబినేషన్. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 60 ఏళ్ల వయస్సు నాటికి ఆరోగ్యంగా ఉండటానికి రాయలసీమ వంటకాలైన జొన్నరొట్టె, రాగి సంగటి ఉల్లిగడ్డ కారం, నలిసిన కారం తినేవారని ప్రతీతి. అవే కాదు కొర్ర అన్నం, సజ్జ రొట్టె, గుత్తి వంకాయ కూర సీమ జిల్లాల్లో భూస్వాములు మొదలు సాధారణ వ్యవసాయ కూలీల వరకు ఇంట్లో ఒకనాడు వెన్నపూసలా అందరి నోళ్లలో చల్లగా జారిన వంటకాలు.. అవి నేడు క్రమేణ కనుమరుగవుతున్నాయి. ప్రస్తుత రోజుల్లో తగ్గుతున్న సంప్రదాయ ఆహార పంటలపై 'సాక్షి'ప్రత్యేక కథనం..



కొర్ర పంట



ఉలవ పంట

- తగ్గుతున్న సంప్రదాయ పంటల సాగు
- వాణిజ్య పంటల వైపు రైతన్న చూపు
- పూర్తిగా కనుమరుగైన చిరుధాన్యాల సాగు
- అంతంత మాత్రంగానే జొన్న, సజ్జ పంటల సాగు

బద్వేలు : వ్యవసాయం వ్యాపార మయం కావడం.. రైతులు సంప్రదాయ పంటలకు మంగళం పాడి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపడంతో ఒకప్పుడు రాయలసీమ జిల్లాల్లోని పంట పొలాల్లో ఏకచక్రాధిపత్యంగా రాజ్యమేలిన సాంప్రదాయ పంటలు ఇప్పుడు వాటి జాడ లేకుండా అంతరించిపోతున్నాయి. జొన్న, సజ్జ, కొర్ర, బరిగ, అరికలు, రాగి, ఉలవ, నూగులు, పెసలు, అలసంద, మినుము, వేరుశనగ మొదలగు ఆహార ధ్యానాలు శరీరానికి చక్కటి పౌష్టికాహారాన్ని అందిస్తాయి. గ్రామాల్లో రసాయనిక, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా పశువుల పేడ, చెట్ల ఆకులు ఎరువుగా ఉపయోగించి రాసుల కొద్దీ పండించిన ధాన్యం జిల్లాలో ఒకనాడు ప్రధానమైన తిండి గింజలు. కానీ కాలక్రమేనా వచ్చిన ఆధునిక పోకడల వల్ల సాంప్రదాయ పంటల సాగు గణనీయంగా తగ్గించి పక్క రాష్ట్రాల రైతులు పండిస్తున్న హైబ్రీడ్ పంటల సాగుపై మన రైతులు ఆధారపడుతున్నారు. సాంప్రదాయ పంటల స్థానంలో వాణిజ్య పంటలైన హైబ్రీడ్ (ఆడ, మగ) జొన్న, సజ్జ, పత్తి, పొద్దుతిరుగుడు తదితర పంటలు పొలాలను ఆక్రమించేశాయి. వీటితో పాటు ఆదాయాన్ని సమకూర్చే వేరుశనగ, పప్పుశనగ, పొద్దుతిరుగుడు పంటలపై రైతులకు ఆసక్తి పెరిగింది. కనీసం తన కుటుంబ అవసరం మేరకైనా రైతు సాంప్రదాయ పంటలు సాగు చేయడంలేదు. బద్వేల్ నియోజకవర్గంలోని మండలాల్లో వేలాది ఎకరాల్లో ప్రస్తుతం పత్తి,‘సజ్జ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు సాగులో ఉంటున్నాయి. అరికెలు, బరిగెలు, కొర్రలు, ఉలవలు, ఆవాలు, నువ్వులు లాంటి చిరుధాన్యాల ఆనవాలు కన్పించడం లేదు. షుగర్ వ్యాధిగ్రస్తులకు కొర్రన్నం మంచి విరుగుడు. కానీ వారికి కొర్ర బియ్యం దొరకడమే కరువైంది. గ్రామాల్లో గతంలో ఏ ఇంట్లో చూసిన జొన్న రొట్టెల పిండిని తట్టేవారు. కానీ ఇప్పుడు రొట్టే ముక్కా కూడా బరువైంది. ప్రస్తుతం కడప, కర్నూల్ లాంటి నగరాల్లో రొట్టెల అమ్మకాలే జీవనోపాధిగా అనేక కుటుంబాలు బతుకుతున్నాయి. అక్కడ రొట్టెల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. గ్రామాల్లో మాత్రం జొన్నరొట్టెలు కాల్చేవారు కరువై షుగర్, బీపీ లాంటి వ్యాధిగ్రస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సాంప్రదాయ పంటలు పండించే విధంగా రైతులను ప్రోత్సహించాలని ప్రజలు కోరుతున్నారు.

రాగి సంగటి, సజ్జ సంగటే బలం



మా కాలంలో తెల్లవారుజాము నుంచే రోటి దగ్గర సజ్జలు, జొన్నలు దంచి సంగటి చేసుకునేవారం. రాగి సంగటి ఒంటికి బలం. వడ్ల పండించడం తక్కువే. అప్పట్లో వడ్ల బియ్యం పెద్దోళ్లు తినేవారు. మేమంతా రాగి సంగటి, జొన్న సంగటి రొట్టేలు తినేవారం. ఇప్పడేముంది మందులు వేసి పండించిన తిండి గింజలు. తిన్న దగ్గర నుంచి కడుపులో మంట. రోజూ ఏదోక రోగం. అప్పట్లో అసలు ఆసుపత్రంటే ఏందో తెలియదు. మందు బిల్ల అసలు వాడలేదు. ఇప్పుడేమో రోగాలు ఎక్కువయ్యాయి.

– ఎ. నారమ్మ, మహిళా రైతు, అక్కివారిపల్లె, కలసపాడు

పూర్వపు తిండి ఇప్పుడు యాడుంది



పూర్వపు తిండి ఇప్పుడు లేదు. తెల్లవారకముందు ఎవరింటి దగ్గర చూసిన రోళ్లు, ఇసురురాళ్లు ఖాళీగా ఉండేవి కావు. జొన్నలు, సజ్జలు, రాగులు వీటితో తప్పా తిండి చేసుకుండేది బియ్యం మాటేలేదు. ధాన్యమంతా పశువుల పేడ, చెట్ల ఆకులు ఎరువుగా వేసి పండించే వారు. చిరుధాన్యాలైన నూగులు, ఉలువలు, అలసందలు, పెసలు, మినుములు ఎవరి ఇంట్లో చూసిన రాసులు పోసి ఉండేవి. ఇప్పుడు వాటి జాడేలేదు. రసాయనాలతో పండించిన బియ్యం తిని వంటి నిండా రోగాలే. ఆసుపత్రుల నిండా రోగులే.

– ఏ.వి. సుబ్బయ్య, పలుగురాళ్లపల్లె, పోరుమామిళ్ల మండలం

సాంప్రదాయ పంటలను ప్రోత్సహించాలి



ఒక పూట కొర్రన్నం తింటే ఏ జబ్బు దగ్గరకు రాదు. రోజుకు ఒక్క పూట కొర్రన్నం తింటే మనిషికి ఏ జబ్బు దగ్గరకు రాదు. ఎందుకంటే ఆ పంటకు ఏ క్రిమిసంహారక మందులు వాడరు. అన్నిరకాల మందులు వేసి పండించిన వరి బియ్యం తిని వంటి నిండా షుగర్, బీపీ వ్యాధులు చేరుకుంటున్నాయి. నాకు 30 ఏళ్లకే షుగర్ వ్యాధి వచ్చింది. బతికినంత కాలం ఆ వ్యాధిని మోయాల్సిందే. చచ్చేంత వరకు అది మనలను వదలదు. ప్రతి ఇంట్లో ఒకరిద్దరికి షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఇప్పటికైనా రైతు సాంప్రదాయ పంటలు సాగు చేసే విధంగా ప్రభుత్వం ప్రోత్సహించాలి.

– వారణాసి రమణయ్య, పురోహితులు, కలసపాడు

నేడు వీరయ్యస్వామి ఆరాధన మహోత్సవం

చాపాడు : మండలంలోని బద్రిపల్లెలో వెలసిన అవధూత దిగంబర వీరయ్యస్వామి దేవాయలం వద్ద గురువారం 48వ ఆరాధన మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. గురుపూజ పుష్పాలంకరణతో ఆరాధన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురువారం ఉదయం 6.30 గంటలకు వీరయ్యస్వామి దివ్యజ్ఞాన మందిర సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయటంతో పాటు వివిధ గ్రామాల తాలాల భజన బృందాలచే 24 గంటల పాటు నిరంతరంగా సంకీర్తనలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామి వారికి నైవేద్యము సమర్పించిన అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. రాత్రి 9 గంటలకు గాలివీడుకు చెందిన నాగార్జున నాయుడు డ్రామా కంపెనీ వారిచే శ్రీ సాసవలచిన్నమ్మ పూర్తి నాటకం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జూలై 7న మాదిగ మహామేళా



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

ప్రొద్దుటూరు : ఒంగోలు మున్సిపల్ ఆడిటోరియంలో జూలై 7న నిర్వహించే మాదిగ మహామేళాను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తలతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలుకు చిత్తశుద్ధిని చాటుకున్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యల్లయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీలకు కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో దక్కడం లేదని, ప్రభుత్వాలు నిధులను పక్కదారి పట్టించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహులు మాదిగ, జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నమ్మ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రంగ నాయకులు, శ్రీను, రవి, చిన్న, ఎరికలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల ఆధీనంలో మున్సిపల్ స్థలం



మున్సిపల్ స్థలంలో నిలిపిన గీతాంజలి హైస్కూల్ వాహనాలు

ప్రొద్దుటూరు : స్థానిక బొల్లవరంలోని గీతాంజలి హైస్కూల్ యాజమాన్యం మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించింది. తమ పాఠశాల వెహికల్ పార్కింగ్ కోసం స్థలాన్ని వినియోగిస్తోంది. ఎన్నో ఏళ్లుగా మున్సిపల్ స్థలం నిరుపయోగంగా ఉండగా కొంతకాలం క్రితం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఈ స్థలాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేశారు. పక్కన ఉన్న ప్రైవేట్ స్థలాన్ని విడగొట్టి.. మున్సిపల్ స్థలానికి సమీపంలో గీతాంజలి హైస్కూల్ యాజమాన్యం కొత్త భవనాలను నిర్మించి పాఠశాల ప్రారంభించింది. పాఠశాలకు సంబంధించి పలు వాహనాలు ఉండగా రోజు మున్సిపల్ స్థలంలో వాటిని నిలుపుతున్నారు. ప్రస్తుతం ఈ స్థలం పాఠశాల యాజమాన్యం ఆధీనంలో ఉంది. ఎంతో శ్రమించి ఈ స్థలానికి సర్వే చేయించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇప్పటికైనా రూ.కోట్ల విలువైన ఈ స్థలాన్ని అధికారులు పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యోగాంధ్రలో ప్రజలను భాగస్వాములను చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్రలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలను భాగస్వాములను చేసేందుకు కృషి చేయాలని బద్వేలు ఆర్డీఓఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సభా భవనంలో యోగాంధ్రలో భాగంగా నిర్వహించే కార్యక్రమాలపై మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయా శాఖల అధికారులు, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యంతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. యోగా సాధన ద్వారా ఒత్తిడి, ఆందోళన, మానసిక రుగ్మతల వంటి సమస్యలను దూరం చేయవచ్చని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించి యోగాంధ్రను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 21వ తేదీ ఉదయం 6:30 గంటలకు స్థానిక ఎస్.బి.వి.ఆర్. డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో 5 వేల మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్.బి.వి.ఆర్ విద్యాసంస్థల సెక్రటరీ కె.రితీష్ కుమార్ రెడ్డి, యస్.ఆర్.ఎన్.బి డిగ్రీ కళాశాల ఏవో ఆర్‌వి సాయిక్రిష్ణ, బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, రూరల్ సీఐ ఎం.నాగభూషణ్, ఎస్ఐలు సత్యనారాయణ, శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

21న పట్టణంలో యోగా కార్యక్రమాలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో మున్సిపల్, సచివాలయం, మెప్మా సిబ్బందితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానం, టీటీడీ కల్యాణ మండపం, నామా ఎరుకలయ్య శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఈ నెల 21న ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీనివాసులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగరాజు, యోగా గురువులు వెంకటసుబ్బయ్య, విశ్వనాథ్, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారి అధ్వానం.. ప్రయాణం ప్రమాదకరం



దారుణంగా తయారైన ఎ.ఎ.పాలెం రోడ్డు

పోరుమామిళ్ల : పట్టణంలోని పెట్రోల్ బంక్ దగ్గర ప్రధాన రహదారి నుంచి రెడ్డినగర్, ఆది ఆంధ్రపాలెం, ఎస్టీకాలనీ, ఆర్మీ కాలనీ, జీబీనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్డు అత్యంత ప్రమాదకరంగా తయారైందని మానవ హక్కుల సంఘం చీఫ్ గంగన్న, సెక్రటరీ ఫణిరావులు తెలిపారు. బుధవారం వారు ఆ దారిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అడుగడుగునా గుంతలు పడ్డాయని, రోడ్డుకు ఇరువైపులా ఎత్తైన భవనాలు నిర్మించి, ఇంటి ముందు మట్టి పోయడంతో రోడ్డు పల్లంగా మారిందన్నారు. ఇండ్ల యజమానులు మురికినీరు, కుళాయిల నీరు రోడ్డు పైకి వదిలివేస్తుండటంతో గుంతలు మరింత పెద్దవిగా మారి రాత్రిళ్లు ప్రయాణం చేయాలంటే భయం వేసేలా ఉందని తెలిపారు. ఈ దారిలో పాఠశాల బస్సులు, వందలాది మంది విద్యార్థులు వెళ్లాల్సి ఉన్నందున గుంతలతో అవస్థలు తప్పడం లేదన్నారు. నిత్యం పెద్ద పెద్ద లోడుతో లారీలు తిరుగుతుండటంతో పరిస్థితి నరకంగా ఉందన్నారు.

కోర్టును ఆశ్రయించిన మానవ హక్కుల నేతలు

రోడ్డు అధ్వాన పరిస్థితిపై సంవత్సరం క్రితం బద్వేలు కోర్టును ఆశ్రయించామని వారు వివరించారు. న్యాయమూర్తి ఆర్‌అండ్‌బీ అధికారులకు నోటీసులు జారీ చేసి కోర్టుకు పిలిపించి మాట్లాడటం జరిగిందన్నారు. అధికారులు త్వరగా మరమ్మతులు చేసి దారి బాగు చేస్తామని రాత పూర్వకంగా తెలిపారని, అయినా సంవత్సరం దాటినా వారు పట్టించుకోలేదన్నారు. మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే దారి పరిస్థితిని బాగు చేయకపోతే తాము మళ్లీ కోర్టుకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

పోరుమామిళ్ల : మండలంలోని సిద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పోలిరెడ్డి, మనోహర్, ప్రశాంతిలను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో విజయ భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంగళరెడ్డి, గంగయ్య, హరినాథరెడ్డి, సుమలత, చంద్ర కుమార్, ఓబులమ్మ, రామకృష్ణ, రవీంద్రబాబు, రాజగోపాల్, పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

చాపాడు : ఈనెల 21న మండల వ్యాప్తంగా నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రత్యేకాధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 21న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహిస్తోందన్నారు. అన్నిశాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

రోజూ యోగా చేయాలి

పోరుమామిళ్ల : ఈ నెల 21న ఒక్కరోజే కాకుండా రోజూ పాఠశాలలో యోగా జరిగేలా చూడాలని సర్వశిక్షా అభియాన్ అధికారి విజయభాస్కర్ సూచించారు. బుధవారం టేకూరుపేటలోని ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. వంట గది పరిశీలించి, సన్నబియ్యంతో అన్నం వండారా? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలో ప్రతి తరగతికి ఉపాధ్యాయున్ని నియమించిందన్నారు. పాఠశాల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ బాలచంద్రయ్య, ఉపాధ్యాయులు విక్టర్‌బాబు, చెన్నయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, జయలక్ష్మితో పాటు ఎస్ఎంసీ చైర్మెన్ రవికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం

పోరుమామిళ్ల : జిల్లా మేధావుల ఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గాజులపల్లె రవిచంద్రారెడ్డి, జిల్లా ప్రచార విభాగ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గొడుగు మస్తాన్‌లు నియమితులైన సందర్భంగా బుధవారం రాత్రి పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో భారీ స్థాయిలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారిరువురిని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డిలతో పాటు పార్టీలోని అందరు జిల్లా, మండల స్థాయి నేతలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు సన్మానించారు. అనంతరం వారు ఈ పదువులు తమకు రావడానికి కారణం ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఆదిత్యారెడ్డి అంటూ వారిని కృతజ్ఞతాపూర్వకంగా శాలువాలు, పూలదండలతో సన్మానించారు.

జీవాల పెంపకం ద్వారా ఆర్థిక భరోసా



బుక్‌లెట్ విడుదల చేస్తున్న సీహెచ్.శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు : జీవాల పెంపకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. మండలంలోని పశువైద్య కళాశాలలో జీవాల పోషణ మెలకువలు – ఖనిజలవణాల ప్రాముఖ్యత అంశంపై బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పశు పోషణపై బుక్‌లెట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ జీవాలు, పొట్టేళ్ల పిల్లల పెంపకం ద్వారా రైతులు ఏడాది పొడవునా ఆదాయాన్ని ఆర్జించవచ్చని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, పెట్టుబడివ్యయం తగ్గించుకోవచ్చని సూచించారు. పశు పోషణ విభాగాధిపతి డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ రాజకిశోర్, డాక్టర్ ఇందిర, డాక్టర్ త్రివేణి, డాక్టర్ జ్ఞాన చరిత, డాక్టర్ భార్గవి, డాక్టర్ విజయకుమార్ పలు అంశాలపై రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు, పెద్దముడియం, భీమగుండం, టంగుటూరు, కొర్రపాడు, పోట్లదుర్తి, కమలాపురం ప్రాంతాల నుంచి 30 మంది రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం



అర్కటవేములలో మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణమూర్తి

రాజుపాళెం : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పంటల సాగులో మంచి దిగుబడులు సాధించవచ్చునని మైదుకూరు ఏడీఏ ఎం.కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని అర్కటవేముల వేణుగోపాలస్వామి ఆలయం, సోమాపురం గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు ఈకేవైసీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. ఏఓ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్‌కుమార్, సుధాకర్, చంద్రమ్మ, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలను పాటించాలి



కోడిగుడ్లపాడులో అరటి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కాశినాయన : రైతులు పంటలు సాగు చేసేటప్పుడు మెలకువలను పాటించాలని ఏఈఓ రవి సూచించారు. బుధవారం మండలంలోని కోడిగుడ్లపాడు, బసనపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ పంటలు సాగు చేసే సమయంలో రైతులు మెలకువలను పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చన్నారు. వర్షాధారం కింద సాగు చేసే పంటల్లో అంతర పంటలు సాగు చేయడం వలన లాభాలు పొందవచ్చని తెలిపారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. మిరప, మొక్కజొన్న పంటలలో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. రైతులు ఎక్కువగా పంట పొలాలకు డీఏపీ, పొటాష్ వాడుతుంటారని, వీటితోపాటు మెగ్నీషియం, క్యాల్షియం, సల్ఫర్, జింక్, బోరాన్ వంటి సూక్ష్మ పోషకాలు అందించాలని తెలిపారు. అనంతరం అరటి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కోడిగుండ్లపాడు, కొండ్రాజుపల్లి వీఏఏ మధు, రైతులు పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే వరిలో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి

బి.కోడూరు : రైతులు సాగు చేసే వరిపంటలో విత్తన ఎంపిక మొదలు పచ్చిరొట్టె, సేంద్రియ పద్ధతులను పాటిస్తే రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. బుధవారం మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు మండలంలో విస్తారంగా నారు మళ్లను సిద్ధం చేసుకుంటున్నారని, వరిపంటను చీడపీడల నుంచి కాపాడి అధిక దిగుబడిని సాధించి అధిక లాభాలు ఏ విధంగా పొందాలో రైతులకు పలు సలహాలు సూచనలను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తమ కాలనీలోని పాఠశాలను విలీనం చేయొద్దు

చాపాడు : తమ పాఠశాలను ఊర్లో ఉండే పాఠశాలకు విలీనం చేయొద్దని ఇక్కడే ఐదో తరగతి వరకూ కొనసాగించాలని చియ్యపాడు దళితవాడ కాలనీ వాసులు బుధవారం నిరసన చేపట్టారు.

2024–25 విద్యా సంవత్సరం ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన మోడల్ స్కూల్ విధానం సమస్యాత్మకంగా మారింది. ఈ క్రమంలో చియ్యపాడు దళితడలోని ఎంపీపీ స్కూల్‌లోని 3, 4, 5 తరగతులు విద్యార్థులను హైస్కూల్‌లో విలీనం చేయాల్సి ఉంది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల ఆవరణలో కూర్చుని నిరసన తెలిపారు. జూన్ 12 నుంచి పాఠశాలను పునః ప్రారంభించినప్పటి నుంచి విద్యార్థులను పాఠశాలకు పంపడం లేదు. తమ పాఠశాల విలీన ప్రక్రియను ఆపేస్తేనే తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తామని లేకుంటే పాఠశాలకు పంపించే ప్రసక్తే లేదని తల్లిదండ్రులు తేల్చి చెప్పారు. ఈ విషయంపై ఎంఈఓ రవిశంకర్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ నిబంధనల మేరకే పాఠశాలను కొనసాగించాలని, గ్రామంలోని విద్యార్థులు ఒక చోట ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, అక్కడ ఐదు మంది ఉపాధ్యాయులు బోధిస్తారని తెలిపారు.